సాక్షి పల్నాడు

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు

నగరం: శ్రావణ శనివారం పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసునికి విశేష పూజలు చేశారు.



వెండి వస్తువులు వితరణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి హైదరాబాద్‌కి చెందిన మల్లంపల్లి రాజశేఖరరావు, విశాలక్ష్మి దంపతులు వెండి వస్తువులను కమిటీ సభ్యులు నరేష్‌కి అందించారు.



శనీశ్వరుడికి పూజలు

మంగళగిరి: పట్టణంలోని శివాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో శనీశ్వరుడికి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



సత్తెనపల్లి: సెప్టెంబర్ 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం సత్తెనపల్లి నాలుగు న్యాయస్థానాల పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో రాజీ పడతగిన సెక్షన్లకు సంబంధించి కేసులు ఎక్కువగా పరిష్కారం కావాలని సూచించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆలయ కప్పు రాళ్లకు గ్రామోత్సవం



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ కప్పు రాళ్లకు శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు రెండు శతాబ్దాల కిందట నిర్మించిన ఆలయం జీర్ణావస్థకు చేరడంతో గ్రామస్తులు జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. కొత్త ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్ల మేర వెచ్చిస్తున్నారు. ఆదివారం పైకప్పు వేయనున్నందున పైకప్పుకు వినియోగించన్ను రాళ్లను ప్రత్యేక వాహనంపై ఉంచి బాజాభజంత్రీలతో ఆలయ కమిటీ సభ్యులు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కప్పు రాళ్లను ఆలయం వద్దకు చేర్చారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం కప్పురాళ్లతో ఆలయ కప్పు పూర్తి చేసి అనంతరం అన్నదానం నిర్వహించనున్నారు.

వ్యాపార నైపుణ్య శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే పల్నాడు జిల్లా పరిధిలోని ఔత్సాహిక యువతకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో జనరేట్ యువర్ బిజినెస్ అనే ప్రోగ్రామ్ ద్వారా యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9160200652 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ వద్ద శనివారం రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. రెండు క్రస్ట్‌గేట్లు 8 అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉండగా.. ఇది 312.0450 టీఎంసీలకు సమానం. సాగర్ నుంచి కుడి కాలువకు 8,298, ఎడమ కాలువకు 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 29,354, ఎస్‌ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 72,994 క్యూసెక్కులు వచ్చి చేరుతుండటంతో అంతే మోతాదులో సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్నారు.

నేడు తెనాలిలో జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

తెనాలి: గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఆదివారం గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ దగ్గర్లోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహకురాలు, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ ఘట్టమనేని సాయిరేవతి ఒక ప్రకటనలో తెలియజేశారు.

కౌలు కష్టాలు

సర్కారు సవతి తల్లి ప్రేమ



పత్తి పొలంలో గుంటక తోలుతున్న రైతు

- రుణాల పంపిణీలో ముందుకు పడని అడుగులు
- జిల్లాలో కౌలు రైతులకు రూ.210 కోట్లు రుణ లక్ష్యం
- ఇప్పటికి కేవలం రూ.9.50 కోట్లు పంపిణీ
- 75.87 శాతం మందికే పంట సాగు హక్కు పత్రాలు

సత్తెనపల్లి: కౌలు రైతుల కష్టాలపై సర్కారు కనికరం చూపడం లేదు. వారి అవసరాలపై దృష్టి సారించడం లేదు. దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకుల నుంచి ఆశించిన స్థాయిలో రుణాలు ఇవ్వకపోవడంతో పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నారు. కౌలుకి భూమి సాగు చేసే రైతులకు సాగు హక్కు పత్రాలు (సీసీఆర్సీ) పొందలేక భూములు సాగు చేయలేని పరిస్థితుల్లో కౌలుదారులు కాలం వెళ్లదీస్తున్నారు. కొందరు భూ యజమానులు పాస్‌పుస్తకాల జిరాక్స్‌లు ఇవ్వకపోవడంతో సీసీఆర్సీ కార్డులు పొందలేక బ్యాంకుల్లో రుణాలు అందక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకుంది. దీనికి తోడు జిల్లాలో అనేక మండలాల్లో కౌలుదారులు గతేడాది సాగు చేసిన భూమికి అధికారులు సీసీఆర్సీ కార్డులు జారీ చేశారు. వాస్తవానికి ఆ కౌలుదారులు ఈ ఏడాది మరొక భూమిని సాగు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పరంగా అందే రాయితీలు కౌలు రైతులు కోల్పోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 65 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు 49,313 మందికి సీసీఆర్సీ కార్డులు అందజేశారు. 75.87 శాతం మందికి సీసీఆర్సీ కార్డులు అందాయి. పంట సాగు హక్కు పత్రం కలిగిన కౌలు రైతులకు ఏపీ పంట సాగు హక్కు చట్టం -2019ని సెక్షన్ 3(2), 8(ఏ) ప్రకారం 11 నెలల కాల పరిమితికి రెండు పంట సీజన్‌లకు సరిపడేటట్లు ఈ కార్డు అందజేస్తున్నారు. దీన్నే క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ (సీసీఆర్సీ) కార్డులని అంటారు.

పంట రుణాలు నామ మాత్రమే

జిల్లా పరిధిలో ఉన్న 28 మండలాల కౌలు రైతులకు ఈ ఏడాది రూ.210 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం, కానీ 49,313 మందికి సీసీఆర్సీ కార్డులు అందిస్తే వీరిలో ఇప్పటి వరకు 1,335 మంది కౌలు రైతులకు రూ.9.50 కోట్ల రుణాలు అందించారు. దీనిలో కూడా రైతుల చేతికి చెందిన సొమ్ము తక్కువే అని చెప్పవచ్చు. ఎందుకంటే గతేడాది బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలను కొందరు రైతులు వడ్డీ మాత్రమే చెల్లించి రుణాలను రెన్యువల్ చేయించుకోవడంతో కాగితాల్లోనే రుణాలు పొందినట్లు ఉంటుంది. రొంపిచర్ల, ఈపూరు, అమరావతి, శావల్యాపురం, వినుకొండ, నూ జెండ్ల, అచ్చంపేట, కారంపూడి మండలాల్లో ఒక్క కౌలు రైతుకు కూడా రుణాలు దక్కలేదు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



నాకు సొంత పొలం 1.50 ఎకరాలు ఉంది. దీనికి తోడు ఐదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా. ఒక్కో ఎకరానికి రూ.12 వేలు కౌలు చెల్లించాలి. 5.10 ఎకరాల్లో పత్తి, 1.40 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నా. గతేడాది వరకు పంటల సాగు సమయంలో ప్రభుత్వం రైతు భరోసా అందించింది. ప్రస్తుతం ఎలాంటి సాయం అందలేదు. కౌలు రైతు కార్డు గానీ, బ్యాంకులో రుణాలు గానీ అందక పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకునేందుకు ముందుకు రావాలి.

–పిట్టల నాగేశ్వరరావు, కౌలు రైతు, వడ్డవల్లి

పెట్టుబడికి అప్పులు చేయాల్సిందే..



నాకు సెంటు భూమి కూడా సొంత పొలం లేదు. ఏటా ఐదెకరాలు కౌలుకు తీసుకొని ఎకరానికి రూ.15 వేలు కౌలు చెల్లిస్తున్నా. మూడెకరాలు పత్తి, 2 ఎకరాలు మిర్చి సాగు చేస్తున్నా. నాకు సీసీఆర్సీ కార్డు పొందేందుకు భూయజమానులు పాస్ పుస్తకం జిరాక్స్ ఇవ్వడానికి అంగీకరించలేదు. దీంతో బ్యాంకులో రుణాలు కూడా పొందలేకపోయా. ఇప్పటికే పెట్టుబడి నిమిత్తం రూ.లక్ష వడ్డీకి తెచ్చా. ప్రస్తుతం మిర్చి సాగుకు మరో రూ.50 వేలు అప్పు కోసం వెతుకుతున్నా. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకునే లా చూడాలి.

–షేక్ సుభాని, కౌలు రైతు, సత్తెనపల్లి



నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు

వైద్య విభాగ ప్రాంతాలకు రక్షణ కల్పించాలి

- కోల్‌కతా సంఘటనకు నిరసనగా పట్టణంలో భారీ ర్యాలీ
- ర్యాలీలో పాలుపంచుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ప్రభుత్వ డాక్టర్ల ప్రదర్శన

నరసరావుపేట: ఎయిర్‌పోర్టులు మాదిరిగానే వైద్యశాలలు, మెడికల్ కళాశాలలు ఉన్న ప్రాంతాలను సేఫ్ జోన్‌లుగా ప్రకటించి కేంద్ర బలగాలతో ఆయా ప్రాంతాలకు రక్షణ కల్పించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ పీజీ మెడికల్ విద్యార్థినిపై లైంగిక దాడి, హత్య జరిగిన తీరును నిరసిస్తూ శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నరసరావుపేట ఆధ్వర్యంలో ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు తమ విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. డాక్టర్ హత్యను ఖండిస్తూ నిందితులను అరెస్టుచేసి మరోసారి ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ జేసీ సూరజ్ ధనుంజయ్‌కు, జిల్లా పోలీసు కార్యాలయంలో అడ్మిన్ అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్రకు వినతిపత్రాలు సమర్పించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ హత్య సంఘటన జరిగిన తర్వాత ఆనవాళ్లు రూపుమాపేందుకు అదే ఆస్పత్రిపై 200 మంది దుండగులు దాడిచేయటం శోచనీయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సీబీఐచే విచారణ చేయించి హత్యకు కారకులైన నిజమైన దోషులను అరెస్టుచేయాలని కోరారు. ఐఎంఏ అధ్యక్షుడు నాగోతు ప్రకాష్ మాట్లాడుతూ ఇన్నేళ్ల తర్వాత కూడా మహిళలకు రక్షణ కొరవడటం దారుణమని అన్నారు. సంయుక్త కార్యదర్శి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి హాస్పిటళ్లు, వైద్య కళాశాలల్లో మూడెంచల భద్రత ఉండాలన్నారు. బాధితురాలి కుటుంబానికి సత్వరమే న్యాయం జరగాలని కోరారు. డాక్టర్ గద్దం సునీత మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు మరోసారి జరగకుండా కఠినమైన చట్టాలు తీసుకొచ్చి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పాలూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ చదలవాడ ఆదిత్యలు మాట్లాడారు. ప్రైవేటు మహిళా డాక్టర్లు పాల్గొన్నారు.



జేసీ సూరజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వైద్యులు

ఏరియా వైద్యశాల డాక్టర్లు నిరసన

కోల్‌కతా సంఘటనను నిరసిస్తూ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏరియా హాస్పిటల్ నుంచి ఆర్డీవో కార్యాలయం మీదుగా లింగంగుంట్ల కాలనీకి చేరుకొని కలెక్టరేట్, పోలీసు కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

కోడెల, చదలవాడ వర్గీయుల మధ్య శిలాఫలకం చిచ్చు

- శిలాఫలకం తొలగింపుపై కోడెల వర్గీయుల ఆగ్రహం
- ప్రొటోకాల్ కూడా పాటించలేదని నిందలు
- వెంటనే మార్చాలని కాంట్రాక్టర్‌కు అల్టిమేటం



రెయిలింగ్ ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ పేరుతో ఏర్పాటుచేసిన శిలాఫలకం

నరసరావుపేట: మాజీ స్పీకర్, దివంగత నేత డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వర్గీయుల మధ్య శిలాఫలకం తొలగింపు చిచ్చు రేపింది. ఆధునికీకరణ పేరుతో శిలాఫలకాన్ని మార్చిన మాజీ కౌన్సిలర్ భర్తను తీవ్రంగా హెచ్చరించేంత వరకు వెళ్లింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి...2018లో రూ.3.5 కోట్ల వ్యయంతో ఆర్‌యూబీ నిర్మాణం జరిగింది. దీనిని అదే ఏడాది మే రెండో తేదీన అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. అప్పుడు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా నాగసరపు సుబ్బరాయగుప్తా, షేక్ మీరావలి ఉన్నారు. మూడు నెలల తర్వాత ఆర్‌యూబీకి ముందు కూడలిలో నవంబరు రెండో తేదీన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని డాక్టర్ కోడెల ఆవిష్కరించారు. ఆ సమయంలో శిలాఫలకంపై కోడెల పేరుతోపాటు చైర్మన్, వైస్ చైర్మన్ల పేర్లు ఏర్పాటుచేశారు. ఇటీవలనే ఆ విగ్రహానికి రూ.45వేల మున్సిపల్ నిధులతో స్టీలు రెయిలింగ్ ఏర్పాటు చేశారు. దీనికి సంజీవరావు కాంట్రాక్టర్‌గా వ్యవహరించారు. దీనిని ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. డాక్టర్ కోడెల, ఎమ్మెల్యే చదలవాడ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్లతో నూతన శిలాఫలకం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లు తొలగించారు. అంతేకాకుండా ఎన్టీఆర్ జనన, మరణాల తేదీలలో తప్పులు దొర్లాయి. 1996లో ఎన్టీఆర్ మృతి చెందగా 95గా సూచించారు. దీనిపై కోడెల వర్గీయుడైన స్టేడియం మాజీ ఇన్‌చార్జి, మరికొందరు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా ద్వారా కాంట్రాక్టర్‌కు హెచ్చరికలు జారీ చేశారు. వెంటనే నూతన శిలాఫలకాన్ని తొలగించి పాతదే ఉంచాలని అల్టిమేటం జారీచేసినట్లు తెలిసింది.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.సత్యశ్రీ



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ

నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్. సత్యశ్రీ కోరారు. శనివారం పోలీస్ అధికారులతో కోర్టు హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే దిశగా పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్, మోటార్ వాహన, చెక్ బౌన్స్, మనోవర్తి కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షి దారులు సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదం పాల్, వన్ టౌన్, టూటౌన్ సీఐలు విజయ్‌చరణ్, ఏ.భాస్కర్, ఫిరంగిపురం సీఐ వీరేంద్రబాబు, ట్రాఫిక్ సీఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ధర్నా

తెనాలిరూరల్:పొలాలకు నీరందడంలేదంటూ తెనాలి మండలం ఖాజీపేట వద్ద పలు గ్రామాలకు చెందిన రైతులు శనివారం ఆందోళన నిర్వహించారు. తంగెళ్లమూడి, హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాలకు చెందిన రైతులు మండుటెండలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. హైలెవల్ చానల్ నుంచి దిగువకు నీరు రావడం లేదని ఫలితంగా వేలాది ఎకరాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో ఆ మార్గంలో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, దుగ్గిరాల ఇరిగేషన్ అధికారులు, రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

అటకెక్కిన పఠనం

చెవికెక్కించుకోని ప్రభుత్వం



స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర వహించిన గ్రంథాలయాలు నేడు సమస్యలతో కునారిల్లుతున్నాయి. గ్రంథాలయాలపై టెక్నాలజీ తీవ్ర ప్రభావం చూపుతోంది. సెల్‌ఫోన్ మాయలో పడి పుస్తక పఠనపై ఆసక్తి తగ్గింది. దీంతో గ్రంథాలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. దీనికితోడు సిబ్బంది కొరత, సెస్ బకాయిలు భారంగా మారాయి. గ్రంథాలయాల అభివృద్ధికి పాలకులు కూడా ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా న్యూస్ పేపర్లకే పరిమితమవుతున్నాయి.

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 89 పోస్టులు ఖాళీ
- భారీగా సెస్ బకాయిలు
- ఆదరణ తగ్గుతున్న గ్రామీణ గ్రంథాలయాలు
- పలు కేంద్రాల్లో న్యూస్ పేపర్లతో సరి
- పుస్తక పఠనంపై ఆసక్తి పెంచే కార్యక్రమాలు శూన్యం

పెదకూరపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం జిల్లా గ్రంథాలయాలు 1, శాఖ గ్రంథాలయాలు 97, గ్రామీణ గ్రంథాలయాలు 41, పుస్తక పంపిణీ కేంద్రాలు 106 ఉన్నాయి. ప్రస్తుత గుంటూరు జిల్లాలో మొత్తం 36 శాఖ గ్రంథాలయాలు, 10 గ్రామీణ గ్రంథాలయాలు, 26 పుస్తక పంపిణీ కేంద్రాలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 27 శాఖ గ్రంథాలయాలు, 9 గ్రామీణ గ్రంథాలయాలు, 20 పుస్తక పంపిణీ కేంద్రాలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 35 శాఖ గ్రంథాలయాలు, 22 గ్రామీణ గ్రంథాలయాలు, 60 పుస్తక పంపిణీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మొత్తం 205 మంది సిబ్బందికి గాను ప్రస్తుతం 116 మంది పనిచేస్తున్నారు. 89 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటేషన్‌పై పలువురిని సర్దుబాటు చేశారు. సిబ్బంది కొరత అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల్లోని, మున్సిపాలిటీల్లోని గ్రంథాలయాలు తూతూమంత్రంగా నడుస్తున్నాయి. శాఖ గ్రంథాలయాల్లో సొంత భవనాలు 71, అద్దె భవనాలు 15 ఉన్నాయి. గ్రామీణ గ్రంథాలయాల్లో 22 సొంత భవనాలు, 19 ఉచిత అద్దె భవనాలు ఉన్నాయి.

కార్పొరేషన్/మున్సిపాలిటీ	బకాయి
గుంటూరు	రూ.29,77,50,458
మంగళగిరి-తాడేపల్లి	రూ.1,51,03,000
తెనాలి	రూ. 2,52,17,521
నరసరావుపేట	రూ.4,86,51,081
చిలకలూరిపేట	రూ.3,46,21,669
మొత్తం	రూ.42,13,43,729.00

తగ్గుతున్న సందర్శకులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రంథాలయాలను సందర్శించే వారు క్రమేపీ తగ్గుతున్నారు. 2022-23 సంవత్సరంలో జిల్లా గ్రంథాలయాలను 23,544 మంది సదర్శించారు. శాఖ గ్రంథాలయాలను 86,789 మంది, పుస్తక పంపిణీ కేంద్రాలను 57,731 మంది మాత్రమే సందర్శించారు. ఈ లెక్కన గ్రంథాలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గుతుంది.

పుస్తకాలు ఉన్నా.... ప్రయోజనం సున్నా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఉన్న బత్తుల దేవానంద్ చొరవతో గ్రంథాలయాలకు భారీగా నవలలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలు, జాతీయ నేతల జీవిత చరిత్ర పుస్తకాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయాల్లో 73,716 రకాల పుస్తకాలు, శాఖ గ్రంథాలయాల్లో 11,28,286 రకాల పుస్తకాలు, గ్రామీణ గ్రంథాలయాల్లో 29,008 రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నా వాటిని వినియోగించుకునే వారు కరువయ్యారు.

సెస్ బకాయిలు రూ.42 కోట్లు

గ్రంథాలయాలకు సెస్ బకాయిలు గుదిబండగా మారాయి. ప్రజల నుంచి గ్రంథాలయ పన్ను వసూలు చేస్తున్న పాలకవర్గాలు ఆ సొమ్మును గ్రంథాలయాలకు చెల్లించడం లేదు. ఈ విషయం ప్రభుత్వం కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.42 కోట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం. 2023-24 సంవత్సరంలో రూ.10,11,16,050 వసూలు కాగా, 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.9,02,64,356 వసూలైనట్లు జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి సుబ్బరత్నం తెలిపారు. 2009 నుంచి 2024 వరకు పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి బకాయిలు పేరుకుపోయాయి. బకాయిల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి...



పెదకూరపాడులోని శాఖా గ్రంథాలయం

గ్రంథాలయాలకు పూర్వవైభవం తేవాలి



విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలకు పూర్వ వైభవం తెచ్చేలా పాలకులు కృషి చేయాలి. యువతకు పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. పాఠశాలల్లో విద్యార్థులను వారంలో ఒకరోజు గ్రంథాలయాలను సందర్శించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

–కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి

సిబ్బంది కొరతతో ఇబ్బందులు



గ్రంథాలయాల్లో పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు శాఖా గ్రంథాలయాల్లో పనిచేయాల్సి వస్తుంది. వారంలో ఒకసారి పెదకూరపాడుకు వస్తున్నాం. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

–కొర్రపాటి వాణి, లైబ్రేరియన్, పెదకూరపాడు.

బకాయిలు భారంగా ఉన్నాయి

2009 నుంచి సెస్ బకాయిలు భారీగా ఉన్నాయి. లైబ్రేరియన్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న వారితోనే సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. సెస్ బకాయిలతో సొంత భవనాలు, అభివృద్ధి పనులు చేయలేకపోతున్నాం.

–సుబ్బరత్నం, జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి, ఉమ్మడి గుంటూరు జిల్లా.

క్లుప్తంగా

నేడు స్విమ్మర్ల జిల్లా జట్లు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా సీనియర్ బాల బాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.వి. సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25వ తేదీన జరగనున్న 10వ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పోటీలో పాల్గొనే స్విమ్మర్లు తమ ఆధార్, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే ముందుగా తప్పనిసరిగా స్విమ్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

గుంటూరు, ప్రకాశం మ్యాచ్ ప్రారంభం


సిద్ధూ, గుంటూరు


డి.అభిలాష్, ప్రకాశం జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ పోటీలలో భాగంగా శనివారం గుంటూరు, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు తొలిరోజు మొదటి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని డి.అభిలాష్ 72, కె.ఆనంద్ 55, ఎస్.అఖిల్ 52 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించారు. గుంటూరు బౌలర్ సిద్ధూ పొదుపుగా బౌలింగ్ చేసి 19.5 ఓవర్లలో 31 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టపోయి తొమ్మిది పరుగులు చేసింది. ఆదివారం రెండో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

కౌలు రైతు ఆత్మహత్య

గురజాల: అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. వివరాల ప్రకారం... తేలుకుట్ల గ్రామానికి చెందిన గుండాల ఆంజనేయులు (24) 6.5 ఎకరాలు కౌలుకు తీసుకుని గతేడాది పత్తి, మిరప పంటలు సాగు చేశారు. పంట పూర్తిగా దెబ్బతినడంతో పెట్టుబడి కింద తెచ్చిన రూ.9 లక్షల అప్పు మిగిలింది. దీంతో అప్పు ఎలా తీర్చాలనే ఆలోచనతో కొద్ది రోజుల నుంచి మనోవేదన గురవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఇంటి సమీపంలోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఆంజనేయులును బయటకు తీసి గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రం తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

క్రమశిక్షణకు క్రీడలు మారుపేరు

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల ప్రారంభంలో చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చీరాల మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల రూరల్: క్రమశిక్షణకు మారుపేరుగా క్రీడలు నిలుస్తాయని.. చిన్ననాటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పేర్కొన్నారు. చీరాల ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ప్రస్తుత యువత చదువుతో పాటు క్రీడలనూ సమానంగా చూడాలన్నారు. క్రీడలలో రాణించినవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో మంచి ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. క్రీడా పోటీల నిర్వాహకుడు గొట్టిపాటి భాగ్యరాజు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలు రెండు రోజులు పాటు కొనసాగుతున్నట్లు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి 8 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నామని మొదటి బహుమతిగా రూ. 10,116, రెండో బహుమతిగా రూ. 7,116, మూడో బహుమతిగా రూ. 5,116 అందించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గొట్టిపాటి ఎబినేజర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల స్వయం ఉపాధికి నిధులు కేటాయించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ దేవకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ దేవకుమార్

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీల స్వయం ఉపాధి, విద్యకు 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ప్రకాష్‌నగర్‌లోని నాల్గవ తరగతి ఉద్యోగుల భవనంలో జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన బడ్జెట్ వాచ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియేట్‌లో ప్రవేశాల కోసం 12వేలు సీట్లు ఉండగా 39వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, దీని వలన 27వేల మంది గురుకుల కళాశాలల్లో చదువుకునే అవకాశం ప్రతి ఏడాది కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వ ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని 20 నూతన గురుకుల కళాశాలలను ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బాల బాలికల కోసం రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ బి.రమణమూర్తి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి ఎస్సీ, ఎస్టీ కౌలు రైతుకు కార్డులు ఇచ్చి ప్రభుత్వం ఇచ్చే రూ.20వేలు ఆర్థిక సహాయం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, బ్యాంకుల నుంచి రుణాలు, పంట నష్టపరిహారం అందజేసేందుకు బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. నంగార భేరీ రాష్ట్ర అధ్యక్షుడు కోట నాయక్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అడపా మోహన్, మేడే వెంకటరమణ, తోకల సాంబయ్య, జి.కోటిరత్నం, మల్లెల అనీల పాల్గొన్నారు.

21న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరించిన జేఏసీ నాయకులు

తెనాలి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఆగస్టు 21న జరగనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక అయితానగర్‌లో రాష్ట్ర దళిత నాయకుడు పిల్లి విద్యాసాగర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో భారత్‌బంద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం చంద్రబాబునాయుడు మదిలో పుట్టిన కుట్ర అన్నారు. రాజకీయ దురుద్దేశంతో మాదిగలను ప్రోత్సహిస్తూ వర్గీకరణకు తెరలేపారన్నారు. చంద్రబాబుకు తొత్తులుగా వ్యవహరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుల ధోరణి సరికాదన్నారు. 59 ఉపకులాలతో ఐకమత్యంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలను చీల్చడం సమంజసం కాదనీ, దక్షిణ భారత దేశానికి చెందిన 103 మంది మాదిగ, మెహర్ల ఎంపీలు పార్లమెంటులో సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. అంబేడ్కరైట్ ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్ కుమార్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, మొదటి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక హైకోర్టు పిటిషనర్ గెడ్డటి సుందర్ సునీల్ మాట్లాడారు. కార్యక్రమంలో కారుమంచి రవికుమార్, బొనిగల ప్రదీస్, వేము సమత, దేవరపల్లి వీరయ్య, మధిర నాగేశ్వరరావు, బేతాళ రత్నరాజు, కె. మణి కుమార్, కె. వెంకటేశ్వరరావు, బి. రాజశేఖర్, అంబటి ఏసుబాబు, ఆరిగ ప్రసాద్, పిల్లి తిమోతి, పిల్లి దాసు పాల్గొన్నారు.

శ్రీకాంత్ పాణినికి నాసా అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన యువ ఖగోళ, భౌతిక శాస్త్రవేత్త సింగం శ్రీకాంత్ పాణిని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) నుంచి అవార్డు అందుకున్నారు. నూతన ఆవిష్కరణల విభాగంలో ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన శ్రీకాంత్ పాణిని యూఎస్ఏ అలబామాలోని హన్స్‌వెల్లేలో గురువారం జరిగిన కార్యక్రమంలో మార్షల్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ జోసఫ్ పా ప్రై చేతుల మీదుగా ఘన సత్కారాన్ని పొందారు. గుంటూరు నగరానికి చెందిన హిందూ కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు, సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ కుమారుడు శ్రీకాంత్ పాణిని నాసాలో కొన్నేళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. విశ్వంలోని సుదూర ప్రాంతాలపై పరిశోధనలు చేస్తూ, సరిహద్దులను ఛేదించి సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఖగోళ శాస్త్ర పరిశోధలకు గాను తాను అవార్డు అందుకున్నట్లు పురస్కార గ్రహీత శ్రీకాంత్ పాణిని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలపై నాసాకు వందల కొద్దీ ఎంట్రీలు వచ్చినప్పటికీ శ్రీకాంత్ పాణిని అవార్డు వరించడం భారతీయులందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా శ్రీకాంత్ పాణినికి గుంటూరు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు అభినందనలు తెలియజేశారు.

24న విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహా
- ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు ప్రదానం


ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్

చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. యూనివర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహా, గౌరవ అతిథులుగా హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరిరావు, హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వరరావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి) హాజరవుతున్నారని పేర్కొన్నారు. 12వ స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ 1,526 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ చాన్సలర్ తెలిపారు. 26 మంది విద్యార్థులకు బ్రాంచ్‌ల వారీగా అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు అందజేస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ మెడల్, ఎండోమెంట్ అవార్డులు, బహుముఖ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బంగారు పతకం, బెస్ట్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సోషల్ ఎంగేజ్‌మెంట్ అవార్డు, బెస్ట్ లీడర్ మెడల్స్ ఉంటాయని వివరించారు.

ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు

స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్ యూనివర్సిటీ వివిధ రంగాలలో అందించిన సేవలు, కృషికి గాను ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేయనుందని వైస్ చాన్సలర్ తెలిపారు. దొంతినేని శేషగిరి రావు, ముల్లపూడి లోకేశ్వరరావు, కోటిలకు గౌరవ డాక్టరేట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. స్నాతకోత్సవంలో విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్. రఘునాథన్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థులను అధిక సంఖ్యలో తరలిస్తే చర్యలు

ఆటోల యూనియన్‌లతో డీటీసీ సమావేశం

సాక్షి ఎఫెక్ట్


ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీం

పట్నంబజారు: విద్యార్థుల్ని పరిమితికి మించి ఆటోలో తరలిస్తున్న అంశంపై శనివారం 'సాక్షి'లో ప్రమాదం అంచున ప్రయాణం' పేరుతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్టీఏ అధికారులు స్పందించారు. స్వర్ణభారతీనగర్‌లోని డీటీసీ కార్యాలయంలో శనివారం ఆటో యూనియన్ నాయకులు, ఆటోడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థుల్ని ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో 12 సంవత్సరాల్లోపు విద్యార్థుల్ని ఆరుగురికి మించి ఎక్కించకూడదని, స్కూల్ బ్యాగు, లంచ్‌బాక్సులు ఆటో బయట వేలాడదీయరాదని చెప్పారు. ఆటోల వెనుక డోర్ తీసి, డ్రైవర్ల పక్కన విద్యార్థుల్ని కూర్చొబెట్టకూడదని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని, ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు.

కాల్వలో జారి పడి వ్యక్తి మృతి



ముప్పాళ్ల: ప్రమాదవశాత్తూ కాల్వలో జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పెదనందిపాడు బ్రాంచి కాలువ వద్ద శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నార్నెపాడు గ్రామానికి చెందిన షేక్ అల్లా భక్షు(40) ప్రమాదవశాత్తూ కాలువలో జారి పడ్డాడు. గమనించిన స్థానికులు బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో డ్రాపులో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.హజరతయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


దుర్గాప్రసాద్ మృతదేహం


వెంకటేశ్వరరావు మృతదేహం


ప్రమాదంలో ధ్వంసమైన కారు

తెనాలి రూరల్: అతి వేగం, రోడ్డుపై అవగాహన లేకపోవడంతో కారు అదుపుతప్పి గోడను ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తెనాలి శివారు పెదరావూరు వద్ద శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదకాకానికి చెందిన దుర్గాప్రసాద్(33) ఏడాది కిందట కారు కొని బాడుగులకు తిప్పుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక గుంటూరు నుంచి వెల్లటూరుకు బాడుగకు వచ్చాడు. ప్రయాణికులను దింపి తిరిగి వెళ్లే క్రమంలో వెల్లటూరుకు చెందిన గుంటూరు వెంకటేశ్వరరావు(50)ను ఎక్కించుకున్నాడు. వీరు ప్రయాణిస్తున్న కారు తెనాలి సమీపంలోని పెదరావూరు గ్రామ శివారుకు చేరుకోగానే అదుపు తప్పి, రోడ్డు వెంబడి ఉన్న గోడకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు 108, పోలీసులకు సమాచారమందించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాల్ని వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకటేశ్వర్లుకి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. వెల్లటూరులో నివాసం ఉంటూ తెనాలిలో వాచ్‌మేన్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న నిర్వహించనున్న జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఈనెల 22లోపు దరఖాస్తుల్ని సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులతో పాటు హెచ్‌ఎంలు అందజేసిన దరఖాస్తుల్ని ఎంఈవోలు పరిశీలించిన తరువాత ఈనెల 24లోపు సంబంధిత ఉప విద్యాశాఖాధికారులకు పంపాలని సూచించారు. ఉప విద్యాశాఖాధికారులు వాటిని ఈనెల 27లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలని తెలిపారు. దరఖాస్తుదారులు కనీసం 15 ఏళ్ల బోధన అనుభవంతో పాటు ఎటువంటి క్రమశిక్షణా చర్యలకు లోనై ఉండరాదని తెలిపారు. ఉప విద్యాశాఖాధికారులు దరఖాస్తుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే డీఈవో కార్యాలయానికి పంపాలని ఆమె స్పష్టం చేశారు.